# సకల సౌకర్యాలతో..
# సర్కారు స్కూళ్లు



బ్రాహ్మణతర్లా హైస్కూలు ప్లస్‌లో ల్యాబ్

| | |
|---|---|
| పలాసలో ప్రభుత్వ పాఠశాలలు | 85 |
| విద్యార్థుల సంఖ్య | 7756 |
| నాడు-నేడు కింద వెచ్చించిన మొత్తం | రూ.16.73 కోట్లు |
| మొదటి విడతలో అభివృద్ధి చేసిన పాఠశాలలు | 23 |
| రెండో విడతలో అభివృద్ధి చేసిన పాఠశాలలు | 46 |
| కొత్త భవనాల నిర్మాణానికి వెచ్చించిన మొత్తం | రూ.9 కోట్లు |
| కొత్తగా మంజూరైన జూనియర్ కళాశాలలు | 1 |

- నాడు-నేడుతో విద్యాలయాల రూపురేఖలు మార్పు
- పూర్తిస్థాయిలో వసతులు కల్పన
- ఆనందంలో విద్యార్థులు




పలాస: ఒకప్పుడు ప్రభుత్వ విద్యాలయాలంటే పెచ్చులూడిన పైకప్పులు, విరిగిపోయిన తలుపులు, ఊడిపోయిన కిటికీలు దర్శనమిచ్చేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మనబడి నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా పలాస మండలంలో పాఠశాలలను అభివృద్ధి చేశారు.మొదటి విడతగా 23 పాఠశాలల్లో సకల సౌకర్యాలు చేకూర్చారు. రెండో విడతలో 46 పాఠశాలలను అత్యాధునికంగా మార్చి కొత్త భవనాలను నిర్మించారు. ఇందుకు రూ.16.73 కోట్లు వెచ్చించారు. దీంతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు వంటి సామగ్రితో పాటు అమ్మ ఒడి పథకం వర్తింపజేయడంతో తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పలుచోట్ల ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో విద్యార్థులు స్థానికంగానే ఇంటర్మీడియెట్ చదువుతున్నారు.



అధునాతన మరుగుదొడ్డి

### ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో పాఠాల బోధన జరుగుతుండటంతో విద్యార్థులకు పోటీపరీక్షల సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.

– శ్రీనివాసరావు, ఎంఈఓ, పలాస మండలం

### కళాశాలగా అప్‌గ్రేడ్.



పదో తరగతి తర్వాత స్థానికంగా కళాశాల లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడేవారం. ఇప్పుడు మా పాఠశాలనే బాలికల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో అందరూ ఇక్కడే ఇంటర్మీడియెట్ చదువుతున్నాం. బోధన బాగుంది.

– కె.జ్యోత్స్న, ఎంపీసీ, బ్రాహ్మణతర్లా, పలాస మండలం

## నేడు మందసలో మంత్రి అప్పలరాజు పర్యటన



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస: రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖామంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం మందస మండలంలో పర్యటిస్తారని ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ తెలిపారు. మందసలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉద్దానంలోని సువర్ణాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారన్నారు. అలాగే హరిపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, సీసీరోడ్లు, బిన్నళమదనాపురంలో బీటీ రోడ్డు, నాడు-నేడు పాఠశాల భవనాలతో పాటు అభివృద్ధి పనులు, కొత్తపల్లిలో సచివాలయం, నాడు, నేడు పాఠశాల భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సొర్ర ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

## గ్రామీణ ప్రాంత వాసులను చైతన్యం చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి: సామాజిక రుగ్మతలు, ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంత వాసులను చైతన్యం చేసే విధంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా శిబిరాన్ని కొనసాగించాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రావివలస గ్రామంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు మన్నేల కిషోర్, విశ్రాంత ఉపాధ్యాయులు పి.మల్లేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో వి.ల్యూక్‌పాల్, అధ్యాపకులు ఎస్‌హెచ్‌కే జనార్దన్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న 'ఆగండి కొంచెం ఆలోచించండి'



నటనతో అలరిస్తున్న కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్ పరిసరాల్లో ఉన్న నీలకంఠేశ్వరాలయం వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆగండి కొంచెం ఆలోచించండి నాటికతో బిలాయి కళాకారులు అకట్టుకోగా 'భయం' నాటిక ఏకపాత్రాభినయ నటనతో యలమంచిలి పాపారావు అలరించారు. అమాయక ప్రజలు, రైతులను దళారులు, వ్యాపారులు దోచుకుంటున్న ఇతివృత్తాంతంగా ప్రదర్శించిన ఈ నాటికలు ప్రక్షకులను ఆలోచింప జేసింది.

## సీఎం జగన్‌తోనే మహిళా సంక్షేమం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పేరాడ తిలక్ తదితరులు

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. హరిదాసుపురంలో స్థానిక సర్పంచ్ కణితి ధనలక్ష్మి అధ్యక్షతన సచివాలయాల పరిధిలోని వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వలంటీర్లు, పలువురు మహిళలతో వైఎస్సార్ చేయూత, ఆసరా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలను నేరుగా మహిళల ఖాతాలకు జమ చేశారన్నారు. ఆసరా, చేయూత, వంటి పథకాలు మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా, సమాజంలో గౌరవం పెరిగేలా చేశారని అన్నారు. జగన్ మరో మారు ముఖ్యమంత్రి అయితే మహిళలకు మరిన్ని పథకాలు అందజేస్తారని అన్నారు.రానున్న ఎన్నికల్లో టెక్కలి అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అండగా ఉండి వారి విజయాలకు సహకరించాలని కోరారు. అనంతరం పథకాలు పొందిన మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, యర్ర చక్రవర్తి, కింతల ధర్మారావు, అంబోడి విష్ణు, కణితి నారాయణమూర్తి రామచంద్రుడు, పోలాకి మోహనరావు, చిన్ని జోగారావు, అట్టాడ శ్రీనివాసరావు ఉన్నారు.

### మహాశివుడి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: బిర్లంగి గ్రామం నడిబొడ్డులో ఉన్న తటాకంలో గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మహాశివుడి భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పశ్చిమేశ్వర స్వామి ఆలయం వద్ద పదేళ్ల క్రితం నిర్మించిన ఈ శివుని విగ్రహాన్ని శనివారం ప్రాణ ప్రతిష్ఠ చేసిన నేపథ్యంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఎమెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, బాకి లక్ష్మీనారాయణ, కాళ్ల నారాయణ, పిలక దేవరాజు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కవిటి: జగతి పంచాయతీలో రూ.8.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పూడి వరప్రసాద్, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ శనివారం శంకుస్థాపన చేశారు. కవిటి ఇద్దివానిపాలెం బీటీ రోడ్డు ప్రారంభంలో ఉన్న సింహద్వారం నుంచి తుపాన్ షెల్టర్ ఆపోజిట్‌లో ఉన్న వాటర్‌ట్యాంక్‌సెంటర్ వరకు రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ చీకటి భూషరాజు, అర్జాల ముకుందరావు, బావన రవి,హేమంత్, జానకీరావు ఉన్నారు.

## 'మేం సిద్ధం- మాబూత్ సిద్ధం' పరిశీలన



సమావేశంలో కన్వీనర్లు కడియాల ప్రకాష్, యుగంధర్, చిట్టిబాబు

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర పాలకమండలి ఆదేశాల మేరకు మండలంలో జరుగుతున్న 'మేంసిద్ధం-మా బూత్ సిద్ధం'కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించినట్లు ఇచ్ఛాపురం నియోజకవర్గ బూత్‌కన్వీనర్ రాంపత్ని చిట్టిబాబు తెలిపారు. మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్‌లతో కలిసి ఆయన సహలాల పుట్టుగ సచివాలయ పరిధిలోని 124వ బూత్‌లో చేపట్టిన కార్యక్రమాన్ని శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బద్రి ప్రకాష్, రవి, మురళి, బూత్ కన్వీనర్ త్రినాథ్ పాల్గొన్నారు.

### 11న జీడి రైతుల ధర్నా



నీలావతి సర్పంచ్‌సొర్ర తిరుపతిరావును ఆహ్వానిస్తున్న నాయకులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో జీడి పంటకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ ఈనెల 11న కాశీబుగ్గలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపడుతున్నట్లు రైతు సంఘాల నాయకులు కోరారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ జీడి పిక్కల పోరాట కమిటీ ప్రతినిధులు శనివారం నీలావతి, మాకన్నపల్లి, కొబ్బరిచెట్లూరు తదితర గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. గ్రామాల్లో పెద్దలను ప్రత్యేకంగా కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు తెప్పల అజయ్‌కుమార్, మద్దిల రామారావు, కోనేరు గురయ్య ఉన్నారు.

## మంత్రి అప్పలరాజుకు సత్కారం



మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 26వవార్డు పంచాయతీ కార్యాలయం వీధి తరఫున స్థానికులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శనివారం సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వీధికి చెందిన 70 కుటుంబాలు నీటి కోసం ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను వారంతా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సొంత నిధులు రూ. ఐదు లక్షలతో బోరింగును వేసించి నీటి సమస్యను పరిష్కరించారు. కృతజ్ఞతగా వార్డు ఇన్‌చార్జి తంగుడు కనకరాజు, వార్డు పెద్దలు మల్లా కామేష్, నెయ్యిల శివకుమార్, కేశవరావు, ఆనందరావులు మంత్రికి పూలదండ వేసి..దుశ్శాలువతో సత్కరించారు.

### ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధిస్తారని కొళిగాం హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పటానాయక్ అన్నారు. వరుసగా పాఠశాలలకు మూడు రోజుల పాటు సెలవు దినాలు కావడంతో శనివారం ఆయన కొళిగాం, బొడ్డబడ, అరకబద్ర గ్రామాల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వారి తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులపై చదవాలనే ఒత్తిడి తీసుకురావద్దని, పౌష్టికాహారాన్ని అందజేయాలని తల్లిదండ్రులను కోరారు.

## ప్రభుత్వ భవనాలు ప్రారంభం



హరిదాసుపురంలో ఆర్‌బీకేను ప్రారంభించిన పేరాడ తిలక్ తదితరులు

నందిగాం: హరిదాసుపురం, కణితూరులో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శనివారం ప్రారంభించారు. సర్పంచ్‌లు కణితి ధనలక్ష్మి, పేరాడ విమలకుమారి ఆధ్వర్యంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి జడ్యాడ జయరాం, మాజీ ఎంపీపీలు యర్ర చక్రవర్తి, కింతల ధర్మారావు, కణితి నారాయణ మూర్తి, బాలక మధు, చిన్ని జోగారావు, మల్ల సీతారాం, కోనారి రామారావు, కణితి రామచంద్రుడు, అట్టాడ శ్రీనివాసరావు,పోలాకి మోహనరావు, బొంగి హనుమంతురావు, కురమాన ఉత్తంకుమార్ ఉన్నారు.

## జగన్‌ను గెలిపించడానికి సిద్ధం



మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రి చేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని అయోధ్యపురం పంచాయతీ కంద్రగడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు వెల్లడించారు. జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, నాయకులు కె.అజయ్, పి.వైకుంఠరావు, బి.తులసీరావు నేతృత్వంలో 'మేము సిద్ధం- మా బూత్ సిద్ధం' మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కృష్ణ, బి.ఢిల్లేశ్వరరావు, బి.రామకృష్ణ, పి.శివ, మధు ఉన్నారు.

### ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కంచిలి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కంచిలి డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు అన్నారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు 'నీ ఓటు నీ భవిష్యత్తు'పై శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### భవనీపురంలో పోషణ పఖ్వాడా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఆరోగ్యకరమైన పోషకాహార అలవాట్లను ప్రోత్సాహించేందుకే అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పఖ్వాడా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి అన్నారు. భవనీపురం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో శనివారం పోషణ పఖ్వాడా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లల సంపూర్ణ శారీరక, భావోద్వేగ వికాసాన్ని నిర్ధారించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రక్తహీనత శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బద్రి నరసమ్మ, ఆశ కార్యకర్త, స్వయంశక్తి మహిళలు పాల్గొన్నారు.

### వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

మందస: భేతాళపురంలో వలంటీర్లనుకు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రజల వద్దకు ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమాన్ని చేరువ చేస్తున్న వలంటీర్లు అభినందనీయులన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సదుద్దేశంతో ఏర్పాటు చేసిన వలంటరీ వ్యవస్థ సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా 18 మంది వలంటీర్లను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, ఎంపీటీసీ సభ్యుడు సూరాడ వాసు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, జేసీఎస్ కన్వీనర్ చింతాడ గణపతి, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారావు, మోహన్, కూర్మారావు, కపిల్, నారాయణ, పీఎస్ కూర్మారావు పాల్గొన్నారు.

### పోలీసుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు, వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎస్సై అనిల్‌కుమార్

మందస: జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు ఆటల పోటీలు, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మందస ఎస్సై బి.అనిల్‌కుమార్ చెప్పారు. మందసలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ... కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ నెల 10, 11 తేదీల్లో యువత ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 12న ఉచిత మెగా వైద్య శిబిరం మందసలోని క్రీడా మైదానంలో ఎస్పీ రాధిక చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పరామర్శలో నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొఠారీ పంచాయతీ సర్పంచ్ దుక్క ధనలక్ష్మి అత్త పున్నమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను కంచిలి మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు శనివారం పరామర్శించారు. నాయకులు పిట్ట విశ్వనాథం, దుక్క ఆనంద్, మునకాల వీరాస్వామి ఉన్నారు.

### కొబ్బరిచెట్లూరులో మహిళా దినోత్సవం



పాల్గొన్న మహిళలు

పలాస: మండలంలోని కొబ్బరి చెట్లూరు గ్రామంలో శనివారం ఐఫ్వా ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘం ప్రతినిధి తామాడ దాలమ్మ మాట్లాడుతూ.. మహిళా కార్మికులు సంఘటితంగా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం కావాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎస్.జానకమ్మ, దుమ్ము లక్ష్మి, ఎస్.అరుణమ్మ, పుణ్యవతి, చంద్రావతి, ఈశ్వరమ్మ ఉన్నారు.

### వాటర్ ట్యాంకు బోల్తా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు సూదికొండలో శనివారం ప్రమాదం తప్పింది. సూదికొండకు మంచినీటిని సరఫరా చేసేందుకు వెళ్తున్న మున్సిపల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. త్రినాథ ఆలయం వద్ద మలుపు తిరిగే క్రమంలో బోల్తా పడగా.. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## సంక్షిప్తంగా...

### వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కంచిలి: మకరాంపురంలోని షిర్డీ సాయినాథుని ఆలయ 17వ వార్షికోత్సవం ట్రస్టీ బి.రమణసాయి ఆధ్వర్యంలో శనివారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శివాలయం వద్ద చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, సంబల్‌పురి తదితర నృత్యాలు ఆకట్టుకొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

### ఆలయ ప్రతిష్ఠ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: సోంపేట పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న రామా లక్ష్మీసమేత సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎంపీపీ నిమ్మన దాస్ ప్రతిష్ఠా ఏర్పాట్లను శనివారం పరిశీలించి కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ప్రతిష్ఠామహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆలయ ధర్మకర్త పైడిశెట్టి భైరిస్వామి, గ్రామస్తులు డాక్టర్ రమేష్, నగిరి శరత్ ఉన్నారు.

### నీటి పథకం ప్రారంభం



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: మంచినీటి సౌకర్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీపైల దేవదాస్‌రెడ్డి అన్నారు. జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం గ్రామంలో ఆలయం పక్కన రూ. 2.5 లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మించిన మినీ రక్షిత మంచినీటి పథకాన్ని శనివారం ప్రారంభించారు. అలాగే మఠం సరియాపల్లిలోని శివాలయం పక్కన చెరువులో సిమెంట్ మెట్ల నిర్మాణానికి రూ. రెండు లక్షలు మండల పరిషత్ నిధులు మంజూరు కావడంతో, ఆ పనులకు భూమిపూజ చేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మఠం సరియాపల్లి సర్పంచ్ కొణపల సురేష్, నాయకులు ప్రకాష్ చంద్రపండా, రమేష్ గౌడో, పైల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న చింతామణి ట్రస్ట్ సభ్యులు

కవిటి: కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా సేవలందిస్తున్న చింతామణి ట్రస్టు సభ్యుల సహకారం అభినందనీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ట్రస్టు ప్రతినిధులు సందీప్,శాంతిలు శనివారం అమ్మవారిని దర్శించుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పాండవ శేఖర్, ఆరంగి మధు పాల్గొన్నారు

### భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులోని ఉమామహేశ్వరాలయంలో శనివారం పండితుల వేదమంత్రోచ్ఛరణ నడుమ శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతార్పణ చేశారు.

### వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ప్రచారంలో పార్టీ నాయకులు

కోటబొమ్మాళి:రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు కోరారు. చిన్నసాన పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి పీఏసీఎస్ చైర్మన్ బాడాన మురళీధర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, స్థానిక సర్పంచ్ ఎల్లయ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ జి.నాగభూషణరావు, నాయకులు సుంకరి జనార్ధన, దుక్క రామక్రిష్ణ, కోతి చిన్నారావు, జి.గోవిందరావు, పూజారి సత్యం, రాంపాత్రుని శివారెడ్డి, ఎ.సురేష్ ఉన్నారు.